సాక్షి మెదక్

బుధవారం ♦ 4 ♦ జనవరి ♦ 2023



లక్ష్యం 50 వేల ఎకరాలు

రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వం దృష్టి సారించింది. రైతులను సాగువైపు మళ్లించేందుకు అవగాహన కల్పిస్తోంది. 8లో



ఔటర్‌పై అత్యవసర వైద్యసేవలు

ఔటర్ రింగురోడ్డుపై ప్రమాదాల నియంత్రణకు హెచ్‌ఎండీఏ అనేక చర్యలు చేపట్టింది. ప్రతీ 8కిలోమీటర్లకు ఒక అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. 8లో



సావిత్రీబాయి మార్గం అనుసరణీయం

సావిత్రీబాయి 192వ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. 9లో

న్యూస్‌రీల్

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డీసీహెచ్‌ఎస్ పీసీ శేఖర్



నియామక పత్రాలను అందిస్తున్న డీసీహెచ్‌ఎస్ పీసీ శేఖర్

మెదక్‌జోన్: ప్రజలకు సేవలందించడంలో వైద్యుల పాత్ర ఎంతో ముఖ్యమని డీసీహెచ్‌ఎస్ పీసీ శేఖర్ అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా ఆస్పత్రి, తూప్రాన్, నర్సాపూర్‌లో నూతనంగా నియామకమైన వైద్యులకు ఆయన ఆర్డర్ కాపీలను అందించారు. నూతనంగా నియామకమైన వైద్యులు అంకితాభావంతో పనిచేయాలని సూచించారు.

సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శం



నివాళి అర్పిస్తున్న డీఈఓ

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మంగళవారం గూడూర్ కస్తూర్బా గిరిజన బాలికల వసతి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాలికా విద్యకోసం సావిత్రిబాయి చేసిన కృషిని కొనియాడారు. ఎంఈఓ బుచ్చనాయక్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాధిక, ఉపాధ్యాయులు జ్వాల, స్వరూప, కోమల, జ్యోతి, స్వప్న, రాణి, దివ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సోషల్ టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్ ప్రశ్న పత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు రవిబాబు, సంతోష్‌కుమార్, జగదీష్, ఇందుమతి, రాధ, జ్వాలా తదితరులు ఉన్నారు.

కొడిపల్లి సీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ చందు నాయక్

కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లి సీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌ఓ చందునాయక్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరును, ఓపీని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆస్పత్రిలో చికిత్సలతో పాటు అన్ని రకాల రకాల పరీక్షలు చేస్తున్నారని, రోగులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. త్వరలో కొడిపల్లి పీహెచ్‌సీకి డాక్టర్ నవీన్ కుమార్, ఫర్హాజ్, శ్రీకాంత్‌లు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్ కుమార్ ఫర్హాజ్, హెల్త్ సూపర్‌వైజర్‌లు మార్తా, ఏసుమణి, రాధాకృష్ణ, శ్రీధర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'రెంజర్ల రాజేశ్‌పై చర్యలు తీసుకోవాలి'



ధర్నా నిర్వహిస్తున్న యువజన సంఘాలు

కొల్చారం(నర్సాపూర్): బాసర సరస్వతీ అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రెంజర్ల రాజేశ్‌పై చర్యలు తీసుకోవాలని కొల్చారం మండలం రంగంపేటకు చెందిన యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. రాజేశ్ వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూసివేసి ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి మెదక్–జోగిపేట ప్రధాన రహదారిపైకి ధర్నా నిర్వహించారు. నాస్తికులుగా చెప్పుకునే వ్యక్తులు భావ ప్రకటన స్వేచ్ఛ పేరిట హిందూ మతానికి చెందిన దేవుళ్లను దూషించడం సరి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మతాలకు అతీతంగా సరస్వతీమాతను ప్రతీ ఒక్కరు పూజిస్తారని గుర్తుచేశారు. ఎవరైన కించపరిచేలా మాట్లాడితే సహించబోమని తెలిపారు.

ఎంసెట్‌కు ఉచిత శిక్షణ

- ఇంటర్ విద్యార్థులకు ప్రారంభం
- రెండు నెలల పాటు తరగతులు
- అర్హత పరీక్షలో ప్రతిభ చూపితే శిక్షణకు ఎంపిక
- వంద మంది విద్యార్థులకు అవకాశం



నార్సింగ్‌లో కోచింగ్‌కు హాజరైన ఇంటర్ విద్యార్థులు

మెదక్‌జోన్: సర్కారు కళాశాలల్లో చదివే విద్యార్థులకు జాతీయస్థాయి ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్ష (నీట్)కు ఉచిత కోచింగ్ అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతిభ ఉండి ఆర్థిక స్తోమత లేక ఎంబీబీఎస్ లాంటి ఉన్నత విద్యకు అవసరమైన కోచింగ్ తీసుకోలేక వెనకబడుతున్నారు. వీరికి ఉచితంగా నీట్ కోచింగ్ అందించి డాక్టర్లు, ఇంజినీర్లుగా రాణించేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. జిల్లాలో ఇంటర్ విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా శిక్షణ అందించేందుకు ఈ కోచింగ్ బంగారు అవకాశంగా మారింది.

జిల్లా వ్యాప్తంగా..

- మెదక్‌జిల్లాలో 16 ప్రభుత్వ ఇంటర్మీడియెట్ కళాశాలలు ఉండగా వాటిలో 8 వేల పైచిలుకు మంది విద్యార్థులు ఉన్నారు.
- కాగా వాటిలో ఎంపీసీ, బీపీసీ చదివే విద్యార్థులు ఫస్టియర్‌లో 1,141 మంది ఉండగా సెకండియర్ విద్యార్థులు 1,206 మంది ఉన్నారు.
- ప్రైవేట్ కాలేజీలు, కోచింగ్ సెంటర్లు నీట్, ఎంసెట్‌కు శిక్షణకు వేలకు వేలు ఫీజులు వసూలు చేసి శిక్షణ అందిస్తుండడంతో అందులో చదివే విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధిస్తున్నారు.
- వీరికి దీటుగా ప్రభుత్వ కళాశాల విద్యార్థులు రాణించలేకపోతున్నారు.
- ఈ నెల 2వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో దీనిని ప్రారంభించారు.
- రోజువారి శిక్షణలో భాగంగా సైన్స్, మ్యాథ్స్ విద్యార్థులకు అర్హత పరీక్షకు అవసరమైన సబ్జెక్టుల్లో వివిధ అంశాలను బోధిస్తున్నారు.
- ప్రతి రోజు తరగతుల అనంతరం కళాశాలలో సంబంధిత సబ్జెక్టులపై లెక్చరర్లు అదనంగా గంట సమయం కేటాయించి విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నారు.
- రెండు నెలలపాటు కొనసాగే శిక్షణలో అర్హత పరీక్ష అవసరమైన అంశాలను బోధిస్తారు.
- శిక్షణ అనంతరం ఫిబ్రవరి నెలాఖరున విద్యార్థులందరికీ అర్హత పరీక్ష నిర్వహించి, జిల్లా వ్యాప్తంగా ప్రతిభ చూపిన వంద మందిని ఎంపిక చేస్తారు.

జిల్లా కేంద్రంలో శిక్షణ

- అర్హత పరీక్షలో ప్రతిభ చూపిన 50 మంది బాలికలు, 50 మంది బాలురను ఎంపిక చేస్తారు.
- ఎంపిక చేసిన వంద మంది విద్యార్థులకు ఇంటర్ విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రెసిడెన్షియల్ భవనంలో శిక్షణ అందిస్తారు.
- బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి సౌకర్యం కల్పిస్తారు. శిక్షణ పూర్తయ్యేవరకు విద్యార్థులంతా ఇక్కడే ఉండాల్సి ఉంటుంది.
- శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, వసతితోపాటు భోజనం అందిస్తారు.
- ప్రతీ రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి పోషకాలతో కూడిన భోజనం అందిస్తారు.
- నిపుణుల పర్యవేక్షణలో, సీనియర్ అధ్యాపకులతో తరగతుల నిర్వహణ చేస్తారు.
- తరగతుల నిర్వహణ అనంతరం విద్యార్థులు అన్ని అంశాలపై పట్టు సాధించేలా ప్రతీ రోజు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తారు.
- విద్యార్థులకు ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు తీరుస్తూ మెరుగైన బోధన చేపడతారు.
- ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత శిక్షణతో తమ పిల్లలు ఉన్నత చదువులకు అవకాశం దొరికిందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

విద్యార్థులకు మేలు



ఈ నెల 2నుంచి అన్ని కళాశాలల్లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రెండు నెలల అనంతరం పరీక్షలో ప్రతిభ చూపిన వంద మందికి ఏప్రిల్, మే లో జరిగే ఎంసెట్, నీట్‌కు ఉచిత వసతితో శిక్షణ అందిస్తాం. ప్రభుత్వ కళాశాలల్లో ఎంపీసీ, బీపీసీ చదివే పేద విద్యార్థులకు అందిస్తున్న ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– సత్యనారాయణ, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి



విద్యార్థినులతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

యువత అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌జోన్: యువత అన్ని రంగాల్లో రాణించాలని, వారిలో ప్రతిభను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోందని మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో టీఎన్‌జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవ కార్యక్రమంలో పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల నృత్యాలు ఆహుతులను అలరించాయి. విద్యార్థినులతో కలిసి ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి నృత్యం చేసి జోష్ నింపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువతలో ప్రతిభను వెలికి తీసేందుకు యువజనోత్సవాలు ఉపయోగపడతాయని, ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. చదువుతో పాటు, సాంస్కృతిక అంశాలపై దృష్టి సారించాలని, వివేకానంద స్పూర్తితో ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో బాలికలతో పాటు బాలురు రాణించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు, మున్సిపల్ చైర్మన్ చంద్ర పాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ లావణ్య రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యం.గంగాధర్ మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సయ్యద్ ఉమర్ మొహిద్దీన్, నాయకులు దుర్గాప్రసాద్ మహమ్మద్ జుబేర్ అహ్మద్, కొండ, శ్రీనివాస్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతకు పకడ్బందీ ఏర్పాట్లు



వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి, కలెక్టర్ హరీశ్

- 40 బృందాలతో కంటిపరీక్షలు
- కలెక్టర్ హరీశ్

మెదక్‌జోన్: ఈ నెల 18నుంచి జిల్లాలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ హరీశ్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్వరెడ్డితో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో కలిసి కలెక్టర్ హరీశ్ మెదక్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్లతో కంటి వెలుగు రెండవ విడత పకడ్బందీగా నిర్వహిస్తామని, 40 బృందాలతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. 35 గ్రామీణ, 5 పట్టణ ప్రాంతాలతో పాటు మరో 5 బృందాలను బఫర్‌లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక్కో బృందంలో ఆప్తోమెట్రిస్ట్, వైద్యాధికారి, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు సూపర్‌వైజర్లు, ముగ్గురు ఆశ వర్కర్లు ఉంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ లావణ్య రెడ్డి, జిల్లా వైద్యాధికారి చందు నాయక్, జెడ్పీ సీఈఓ శైలేష్, డీఆర్‌డీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా ముందుకు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

చిన్నశంకరంపేట(మెదక్): అధికారమే లక్ష్యంగా బీజేపీ కార్యకర్తలు ముందుకు సాగాలని జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే వచ్చే శాసన సభ ఎన్నికల్లో విజయం సొంతం అవుతుందన్నారు. మెదక్ నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా నియామకమైన ఎంపీ అరవింద్ ఈ నెల 7న నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం అవుతారని, సమావేశానికి బీజేపీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పట్లోరి పోగులరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దత్తుప్రకాష్, బీజేపీ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, బీజేపీ నియోజవర్గ కన్వీనర్ మధు, సురేష్‌గౌడ్, ఆశోక్, చందు, నర్సింహులు, శంకర్, సయ్యద్, మంజుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కర్నాల్‌పల్లిలో ఆర్టీసీ సేవలను వివరిస్తున్న డీఎం శ్రీనివాస్‌రావు

చేగుంట(తూప్రాన్): ఆర్టీసీ అదిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఆర్టీసీ డిపో డీఎం శ్రీనివాస్‌రావు అన్నారు. కర్నాల్‌పల్లి గ్రామంలో మంగళవారం కళాప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అందిస్తున్న సేవలు, కార్గో రవాణాపై ప్రజలకు తెలియజేసేందుకు అవగాహన కల్పించామన్నారు. అన్ని రూట్లలో ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని, ప్రజా అవసరార్థం మరిన్ని బస్సులు నడిపేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ కనకలక్ష్మి, సేఫ్టీ డ్రైవర్ కెఎం రెడ్డి, కార్గో మార్కెటింగ్ ఇన్‌చార్జ్ సందీప్ ఉన్నారు.

తూప్రాన్: ఆర్టీసీ ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై అవగాహన పెంపొందించేందుకు కళాజాత కార్యక్రమాలు చేపడుతున్నట్లు గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం తూప్రాన్‌లో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కళాజాత నిర్వహించారు. ఆర్టీసీ సేవలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ కనకలక్ష్మి, కంట్రోలర్ రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే డీసీసీ బ్యాంకు రుణాలు



సోమక్కపేటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చిలప్‌చెడ్(నర్సాపూర్): డీసీసీబీ నుంచి తక్కువ వడ్డీ రేటుకే రుణాలు అందిస్తున్నామని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొడిపల్లి డీసీసీబీ చైర్మన్ ప్రద్యుమ్నారెడ్డి అన్నారు. మంగళవారం సోమక్కపేట్ గ్రామంలో రైతులకు నాబార్డ్ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. డీసీసీబీకి ఇటీవలే యూపీఐ సేవలు ప్రారంభించామని, బంగారం, ఎడ్యుకేషన్ రుణాలు, డెయిరీ ఫామ్స్, రైతు నేస్తం, భూములపై రుణాలు, క్రాప్ లోన్స్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ధర్మారెడ్డి, వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ విశ్వంభర, చిట్కుల్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, బ్యాంకు సిబ్బంది నరేష్, శ్రీమాన్, పీఏసీఎస్ సీఈఓ పోచయ్య, రైతులు పాల్గొన్నారు.

తూప్రాన్: రైతులు ఆర్థికంగా ఏదిగేందుకు డీసీసీ బ్యాంకు నుంచి తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నామని మేనేజర్ ఎస్.లలిత తెలిపారు,. మంగళవారం మండలంలోని గుండ్రెడ్డిపల్లిలో రైతులకు సహకార సంఘం, బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సొసైటీ ద్వారా పంట, దీర్ఘకాళిక రుణాలు, పౌల్ట్రీ ఫార్మ్, ట్రాక్టర్, హార్వేస్టర్, హార్టీకల్చర్, సేరికల్చర్ వాహన, గృహ రుణాలు అందిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

విద్యార్థుల సంరక్షణకు కృషి చేయాలి

టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్



మాట్లాడుతున్న టీఎన్జీఓ అధ్యక్షుడు నరేందర్

మెదక్‌జోన్: విద్యార్థుల సంరక్షణకు వసతి గృహ సంక్షేమ అధికారులు కృషి చేయాలని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శేషాచారితో హాజరై మాట్లాడారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ చూపుతూ వారి ప్రతిభను గుర్తించి అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. వసతి గృహ అధికారులకు టీఎన్జీఓల సంఘం అండగా ఉంటుందన్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ గౌస్ మాట్లాడుతూ సంక్షేమ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, ఉపాధ్యక్షురాలు గాండ్ల అనురాధ, ఎండీ ఇక్బాల్ పాషా, ఫజలుద్దీన్, కార్యవర్గ సభ్యురాలు లీలా, మెదక్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు శివాజీ, రామా గౌడ్, పశుసంవర్ధక శాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాల్, సలావుద్దీన్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నగేష్, పాల్గొన్నారు.

పేదల సంక్షేమాన్ని మరిచిన సీఎం

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్



మాట్లాడుతున్న శ్రీకాంత్‌గౌడ్

నర్సాపూర్: రాష్టంలో పేదలు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం కేసీఆర్ మరిచారని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ ఆరోపించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని, కులవృత్తులపై ఆధార పడి జీవిస్తున్న కుటుంబాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమని, త్వరలో రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని శ్రీకాంత్‌గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వెనకబడిన వర్గాలను చైతన్యం చేసేందుకు ఓబీసీ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల వారిగా ఓబీసీ మోర్చా ప్రతినిధులకు ఈనెల 6న ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒకరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రమేష్‌గౌడ్, నాయకులు నర్సింహ్మనాయక్, ఆంజనేయులుగౌడ్, ప్రవీణ్, వెంకట్, శ్రీశైలం, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రక్షణకే తొలి ప్రాధాన్యం

- ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని
- మెదక్ చర్చిలో ఆక్టోపస్ టీం మాక్‌డ్రిల్



మాక్ డ్రిల్‌ను వీక్షిస్తున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ బృందాలు

మెదక్‌జోన్: ప్రజల రక్షణకు కల్పించడమే పోలీస్ శాఖ తొలి కర్తవ్యమని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. ఏరియా డామినేషన్ వ్యాయామంలో భాగంగా జిల్లాకేంద్రంలోని మెదక్ చర్చిలో మంగళవారం ఆక్టోపస్ బృందాలతో మాక్‌డ్రిల్ నిర్వహించారు. తీవ్రవాదుల దాడి జరిగితే చేపట్టాల్సిన ఆన్ సైట్ ఎమర్జెన్సీ ప్రిపరేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. సాధారణ భక్తులు మినహా ఎవరిని ఆలయ పరిసరాలకు అనుమతించలేదు. సుమారు 50 మంది ఆక్టోపస్ కమాండోస్, జిల్లా పోలీస్ సిబ్బంది 50 మందితో డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. చర్చి ప్రాంగణంతో పాటు ఇతర ప్రదేశాల్లో ప్రత్యేకంగా డ్రిల్‌ను నిర్వహించారు. డ్రిల్ భాగంగా ఆక్టోపస్ బృందాలు ఆలయం చుట్టూ ఉన్న చెట్ల పొదల నుంచి లోనికి ప్రవేశించగా, ఫైరింజన్, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచి ప్రజలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో ఎలా సంసిద్ధం కావాలి, ప్రణాళిక ప్రకారం అటాక్‌ను ఎలా ఎదుర్కోవాలి, ఆపరేటింగ్ విధానం, పౌరుల ప్రాణాలను కాపాడడం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ అరుణ్ రాజ్‌కుమార్, మెదక్ డీఎస్పీ సైదులు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసు, సీఐ మధు, ఆర్ఐ నాగేశ్వరరావు, ఆర్ఐ అచ్యుత రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్‌ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రఘు

రాయికోడ్‌(అందోల్‌): సైబర్‌ నేరాల బారిన పడకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జహీరాబాద్‌ డీఎస్పీ రఘు అన్నారు. మంగళవారం రాయికోడ్‌ పోలీస్‌ స్టేషన్‌ను సీఐ వెంకటేష్‌తో కలిసి సందర్శించారు. నమోదైన కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు, పురోగతి తదితర వివరాలను ఎస్‌ఐ ఏడుకొండలును అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత ఫోన్‌ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబర్‌ నేరాల నియంత్రణకు పోలీస్‌ శాఖ కృషి చేస్తోందన్నారు. వాహనదారులు ట్రాఫిక్‌ రూల్స్‌ను విధిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ ధరించాలన్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు ఇదే..

మద్దూరు(హుస్నాబాద్‌): మండలంలోని వల్లంపట్ల గ్రామంలో ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాదగిరి కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో ఇళ్లుతో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సూమారు రూ.5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

చుంచనకోట దుర్గమ్మ గుడిలో చోరీ



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట దుర్గమ్మ గుడిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వచ్చిన పొన్నబోయిన సిద్దులు గుడి తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. ఈ చోరీలో 13 గ్రాముల బంగారు ఆభరణాలు, 36 తులాల వెండి ఆభరణాలు, రూ.5వేల నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



శ్రీకాంత్‌(ఫైల్‌)

టేక్మాల్‌(మెదక్‌): జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన టేక్మాల్‌ మండలం అచ్చన్నపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుండ్ల శ్రీకాంత్‌(27) ఆర్మూర్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాది కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్య మహేశ్వరి తల్లిగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఒక్కడే ఉంటున్న శ్రీకాంత్‌ జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహ త్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గమనించిన ఇరుగుపొరుగు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

లక్ష్యం 50 వేల ఎకరాలు

- 'ఆయిల్‌పామ్‌'పై ప్రత్యేక దృష్టి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- సాగు ప్రోత్సహించేందుకు రాయితీలు

సాక్షి, సిద్దిపేట: రైతులకు దీర్ఘకాలిక ఆదాయం అందించే ఆయిల్‌పామ్‌ సాగుపై ప్రభుత్వం దృష్టి సారించింది. రైతులను సాగువైపు మళ్లించేందుకు అవగాహన కల్పిస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో ఆయిల్‌పామ్‌ సాగును పెంచేలా రైతులను ప్రోత్సహించి, ఐదేళ్లలో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. 35 ఏళ్ల పాటు ఆయిల్‌పామ్‌తో లాభాలు ఆర్జించవచ్చని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పుష్కలంగా నీరు

- సిద్దిపేట జిల్లాలో 6,766 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ సాగవుతోంది. ఇప్పటికే నంగనూరు మండలం నర్మెట్టలో 60 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ ఫ్యాక్టరీ నిర్మాణానికి మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు.
- ఆయిల్‌పామ్‌ సాగుకు నీరు, తేమ ఎక్కువగా ఉండాలి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయక సాగర్‌, కొండపోచమ్మ, మల్లన్నసాగర్‌, అనంతగిరి రిజర్వాయర్లు నిండుగా ఉండడంతో సాగుకు నీటి సమస్య తప్పింది.
- రైతులను సాగువైపు మళ్లించేందుకు గతేడాది నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అశ్వరావుపేటకు తీసుకెళ్లి ఆయిల్‌పామ్‌ సాగు విధానాన్ని చూపించారు.



మర్కూక్‌లో సాగవుతున్న ఆయిల్‌పామ్‌

- అంతేకాకుండా సాగు చేసే రైతులకు ప్రభుత్వం డ్రిప్‌, రాయితీ అందిస్తుండడంతో రైతులు సైతం ఆసక్తి చూపుతున్నారు.
- మొదటి ఏడాది ఎకరాకు సుమారు 5 టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రూ.15 వేలకు పైగా ధర పలుకుతోంది.
- తొలి ఏడాది ఎకరాకు సుమారు రూ. 75 వేల నుంచి రూ. లక్ష వరకు ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.
- నాలుగు నుంచి పదేళ్ల వరకు ఏటా రెండు టన్నుల చొప్పున దిగుబడి పెరుగుతూ వస్తోంది.
- పదేళ్ల నుంచి 35 ఏళ్ల వరకు సుమారు 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.
- బాగా పెరిగిన ఆయిల్‌పామ్‌ తోటలో ఎకరానికి సుమారు ఏడాదికి 15 టన్నుల పంట తీయొచ్చు.
- కనీసం రూ. 15 వేల చొప్పున విక్రయించినా రూ. 2,25,000 వస్తుంది. రూ. 45 వేల వరకు ఖర్చులు పోయినా రూ.1.80 లక్షలు గిట్టుబాటు అవుతుంది.
- మరోవైపు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం ఆర్జించే అవకాశం ఉంది. అంతా కలిపి ఎకరాకు రూ.3 లక్షల వరకు సంపాదించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మంత్రి చొరవతో..

- జిల్లాలో ఆయిల్‌పామ్‌ సాగు విస్తరణకు మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రైతులు సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు.
- వారంలో రెండు రోజులు జిల్లాలోని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో మంత్రి సాగుపై సమీక్ష, టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహిస్తున్నారు.
- ప్రతీ సమావేశంలో ఆయిల్‌పామ్‌ సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులకు సూచిస్తున్నారు.
- దీంతో జిల్లాలో క్రమంగా ఆయిల్‌పామ్‌ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. నెల రోజుల్లో 1,050 ఎకరాల్లో సాగు చేశారు.
- 2021–22 వరకు 655 మంది రైతులు 2,770 ఎకరాల్లో సాగు చేశారు. 2022 ఏప్రిల్‌ నుంచి ఇప్పటివరకు 1,051 మంది రైతులు 3,996 ఎకరాల్లో సాగుచేస్తున్నారు.

సాగు పెంచేందుకు కృషి



ఐదేళ్లలో 50 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ, వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది సహకారంతో సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఈ పంట సాగుతో రైతులు దీర్ఘకాలిక లాభాలు పొందవచ్చు. – శివప్రసాద్‌, డిప్యూటీ డైరెక్టర్‌, వ్యవసాయ శాఖ

జాబ్‌ ఆఫర్‌ అంటూ మెసేజ్‌

లింక్‌ క్లిక్‌ చేసి పలుధపాలుగా రూ.3,49,073 ట్రాన్స్‌ఫర్‌

పటాన్‌చెరు టౌన్‌: జాబ్‌ ఆఫర్‌ పేరుతో ఒకరికి వాట్సాప్‌ మెసేజ్‌ వచ్చింది. తన వివరాలు నమోదు చేసి..నగదు పంపాడు. ఇలా 3,49,073 రూపాయలు సైబర్‌ నేరగాడికి పంపి మోసపోయాడు. పోలీసుల కథనం ప్రకారం ...పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన నరేష్‌ ప్రైవేట్‌ ఉద్యోగి. గత ఏడాది నవంబర్‌ 21వ తేదీన నరేష్‌కు జాబ్‌ ఆఫర్‌ పేరిట వాట్సాప్‌లో ఓ మెసేజ్‌ వచ్చింది. లింక్‌ క్లిక్‌ చేసి వివరాలు నమోదు చేశాడు. ముందుగా రూ.1000 చెల్లించాడు. ఈ మొత్తానికి కమీషన్‌ ఇచ్చారు. పెద్ద మొత్తంలో మనీ ట్రాన్స్‌ఫర్‌ చేస్తే రెట్టింపు డబ్బుతోపాటు కమీషన్‌ ఇస్తామని సైబర్‌ నేరగాడు నమ్మబలికారు. దీంతో బాధితుడు ఫలుదఫాలుగా రూ.3,49,073 ట్రాన్స్‌ఫర్‌ చేయగా, రూ.6,44,398 వస్తుందని నమ్మించారు. అయితే డబ్బు తన ఖాతాలో జమ చేయాలంటూ ఫోన్‌ చేయగా, నరేష్‌ నంబరు బ్లాక్‌లో పెట్టారు. దీంతో తన మోసపోయినట్టు గుర్తించి మొదటగా సైబర్‌క్రైంలో ఫిర్యాదు చేశాడు. మంగళవారం పటాన్‌చెరు ఠాణాలో కూడా ఫిర్యాదు చేశాడు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 23 మంది పట్టుబడ్డారు. మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జరిమానా విధించారు.

పాదచారుడిని ఢీ కొట్టిన వాహనం

- తీవ్రగాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు
- మార్గమధ్యలో మృతి చెందినట్టు వైద్యుల వెల్లడి

పటాన్‌చెరు టౌన్‌: రోడ్డు దాటుతున్న పాదచారుడిని బొలెరో ట్రాలీ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు మార్గ మధ్యలోనే మృతిచెందినట్టు వెల్లడించారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం...వనపర్తి జిల్లా ఖిలాఘనపూర్‌ మండలం ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన దత్తయ్య(44) బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరులోని భగత్‌గల్లిలో నివాసం ఉంటున్నాడు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్‌ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు డ్యూటీకి వెళ్తుండగా నవపాన్‌ సమీపంలో రోడ్డు దాటుతుండగా బొలెరో ట్రాలీ ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. దత్తయ్యను చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు మార్గమధ్యలోనే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



దత్తయ్య (ఫైల్‌)

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కంది(సంగారెడ్డి): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనమండల పరిధిలోని కాశిపూర్‌లో చోటుచేసుకుంది. ఇంద్రకరణ్‌ ఎస్‌ఐ రాజేశ్‌నాయక్‌ కథనం ప్రకారం కాశిపూర్‌కు చెందిన షాపురం శోభన్‌ గౌడ్‌(39) రెండేళ్ల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కడుపు నొప్పి బాధ భరించలేక మద్యానికి అలవాటుపడ్డాడు. దీంతో శోభన్‌ గౌడ్‌ మానసిక స్థితి సరిగా లేదు. ఈక్రమంలో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పైకప్పు రేకులకు అమర్చిన వైపునకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య షాపురం జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



శోభన్‌ గౌడ్‌(ఫైల్‌)

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృత్యువాత పడ్డాయి. కోహెడమండలంలోని తంగళ్లపల్లి మోయతుమ్మెద వాగులో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో పాడిగేదె మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తొంటి రమేశ్‌ రోజూలాగే తన గేదెను వాగు సమీపంలో మేపుతున్నాడు. సోమవారం ఉదయం మెయతుమ్మెదవాగు దిగి నీరు తాగుతుండగా విద్యుత్‌ షాక్‌తో గేదె అక్కడిక్కడే మృతి చెందింది. దీంతో సుమారు 80వేల నష్టం వాటిల్లిందని రైతు రమేశ్‌ తీవ్రంగా రోదించాడు. బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తానని సర్పంచ్‌ పాము నాగేశ్వరి శ్రీకాంత్‌ హామీ ఇచ్చారు.

తోర్నాలలో...

సిద్దిపేటరూరల్‌: కరెంటు షాక్‌కు గురై పాడి గేదె మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్‌ మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో చోటు చేసుకుంది. రైతు సందిరెడ్డి కిష్టారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. తన వ్యవసాయ పొలం వద్ద రోజూలాగే మంగళవారం కూడా గేదెకు నీళ్ల పెడదామని పొలం దగ్గరకు తీసుకెళ్లాడు. పొలంలో నీళ్ల తాగుతుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ అర్తింగ్‌ వైరు తగిలి అక్కడికక్కడే చనిపోయింది. ఇటీవల గేదెను రూ.80వేలతో కొనుగోలు చేశానని, ఇప్పుడు మృతి చెందడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



గేదె వద్ద రోదిస్తున్న బాధిత రైతు

అదృశ్యమైన వ్యక్తి.. శవమై తేలి

సదాశివపేట రూరల్‌(సంగారెడ్డి): అదృశ్యమైన ఓ యువకుడు చెరువులో శవమై తేలిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని వెంకటాపూర్‌ గ్రామంలో చోటుచేసుకుంది. సదాశివపేట సీఐ నవీన్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం..వెంకటాపూర్‌ గ్రామానికి చెందిన మన్నే లక్ష్మణ్‌(24)ఓ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత నెల 31న తన తండ్రి కిష్టయ్యతో కలిసి భోజనం చేసి రాత్రి 9గంటల సమయంలో ఇద్దరు కలిసి పడుకున్నారు. అదేరోజు రాత్రి 12గంటల సమయంలో తండ్రి నిద్రలేచి చూసేసరికి కుమారుడు ఇంట్లో కనబడలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల వారి వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని మొగుల చెరువులో మృతదేహం పైకి తేలింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

చేగుంట(తూప్రాన్‌): అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మాసాయిపేట మండలం బొమ్మారంలో మంగళవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌కు చెందిన కుమ్మరి సత్తవ్వ(60) కూతురు రేణుక వివాహం బొమ్మారం గ్రామానికి చెందిన దత్తుతో జరిగింది. సత్తవ్వ భర్త మూడేళ్ల క్రితం మృతి చెందగా, కూతురు రేణుక వద్ద ఉంటూ అప్పుడప్పుడు ఇబ్రహీంపూర్‌కు వచ్చి వెళుతుండేది. ఏం జరిగిందో గాని మంగళవారం ఉదయం బొమ్మారంలోని కూతురు ఇంట్లో సత్తమ్మ మృతదేహం కిటికి వేలాడుతూ కనిపించింది. అమ్మ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని రేణుక తన తమ్ముడికి ఫోన్‌ చేసింది.విషయం తెలుసుకున్న సత్తవ్వ కుమారుడు స్వామి సంఘటనస్థలికి చేరుకున్నారు. తన తల్లిని అక్క రేణుక, బావ దత్తులే హత్య చేశారని ఆరోపిస్తూ గొడవకు దిగాడు. స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కారు అదుపుతప్పిన ఘటనలో ఒకరి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున రామచంద్రాపురం పట్టణంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్‌ నగరంలోని అంబర్‌పేటకు చెందిన ఎండీ సాజిత్‌(28) డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో అతని స్నేహితులు సుల్తాన్‌, ఇంతియాజ్‌తో కలిసి లింగంపల్లి వైపు నుంచి పటాన్‌చెరులోని ఇస్నాపూర్‌కు తినేందుకు కారులో బయలుదేరారు. అశోక్‌నగర్‌ సమీపంలో వేగంగా వెళ్తున్న కారును అదుపు చేయలేక డివైడర్‌ను ఢీ కొట్టారు. అదే వేగంతో ఎడమ వైపు ఆగి ఉన్న ప్రైవేట్‌ బస్సును ఢీ కొట్టారు. తీవ్ర గాయాలైన ముగ్గురిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే సాజిత్‌ మృతి చెందినట్లు డాక్టర్‌ నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు

బెయిల్‌పై వచ్చి..తాగుడుకు బానిసై

దుబ్బాక: భార్యను చంపిన కేసులో బెయిల్‌పై జైలు నుంచి వచ్చిన భర్త జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రాయపోల్‌ మండలం వడ్డేపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. రాయపోల్‌ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి గ్రామానికి చెందిన చెట్టే సత్తయ్య (30) వ్యవసాయం చేసుకుంటూ.. జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. గతేడాది కుటుంబ సమస్యలతో భార్యను గొడ్డలితో నరికి చంపిన కేసులో జైలు పాలయ్యాడు. సత్తయ్య ఇద్దరు పిల్లలు తన అక్క దగ్గరే ఉంటున్నారు. ఇటీవల బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన సత్తయ్య తల్లి పోచమ్మతో కలిసి వడ్డేపల్లిలోనే ఉంటున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో తల్లి పోచవ్వ అహ్మదీపూర్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి నాలుగు రోజుల క్రితం వెళ్లింది. ఆమె సోమవారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చే వరకు సత్తయ్య ఇంట్లో ఉరేసుకొని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు 3 రోజుల క్రితం ఉరేసుకుని ఉంటాడని తెలిపారు. మృతదేహాన్ని పరీక్షల నిమిత్తం గజ్వేల్‌ ఆస్పత్రికి తరలించారు. తల్లి పోచవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్యాస్‌ కనెక్షన్ల పేరిట మోసం

మద్దూరు(హుస్నాబాద్‌): గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతూ వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారిని మాటల్లో పెట్టి నగదు అపహరించారు. ఈ సంఘటన మండలంలోని మర్మాముల గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఓ గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి గ్రామానికి చెందిన శీలం వితలయ్య ఇంటికి వచ్చి మీకు సబ్సిడీపై గ్యాస్‌ కనెక్షన్‌ మంజూరైందని రూ.3,800 చెల్లిస్తే గ్యాస్‌ సిలిండర్‌, స్టౌవ్‌ ఇస్తామని నమ్మించాడు. మీ కుమారుడు నాకు తెలుసునని ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు నమ్మించాడు. ఆ వ్యక్తి మాటలు నమ్మిన వితలయ్య అతనికి రూ.3800 నగదు ఇచ్చాడు. గ్యాస్‌ బండి తీసుకొస్తానని చెప్పిన వ్యక్తి ఎంతకీ రాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించాడు. ఐదు రోజుల క్రితం లద్నూరు గ్రామానికి చెందిన భోగి శ్రీరాములును సైతం గుర్తు తెలియని వ్యక్తి ఇదే రీతిలో గ్యాస్‌ కనెక్షన్‌ పేరుతో మాయామాటలు చెప్పి అతని నుంచి రూ.11,200 తీసుకొని పరారైనట్లు బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై ఎస్‌ఐ నారాయణను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని కేవలం మర్మాముల గ్రామంలో జరిగిన సంఘటన తమ దృషికి వచ్చిందన్నారు.

అదుపు తప్పిన మహారాష్ట్ర బస్సు

- బైక్‌ను తప్పించబోయి రోడ్డు కిందకు...
- పలువురికి స్వల్ప గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్‌): హైదరాబాద్‌ నుంచి డెగ్లూర్‌ వెళుతున్న మహారాష్ట్రకు చెందిన బస్సు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం పెద్దశంకరంపేట మండలం కమలాపూర్‌ వద్ద 161వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సర్వీసు రోడ్డు మీదుగా వెళుతున్న మహారాష్ట్ర బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కాగా, ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ బాలరాజు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.



రోడ్డు కిందకు దూసుకెళ్లిన మహారాష్ట్ర బస్సు

ప్రేమపెళ్లి..రెండురోజులకే వద్దన్నాడు

- మనస్తాపంతో యువతి ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి

మనోహరాబాద్‌(తూప్రాన్‌): ప్రేమించాడు..పెళ్లి చేసుకున్నాడు..రెండురోజులకే ఇద్దరి కులాలు వేరంటూ వదిలేశాడు. తనకు న్యాయం చేయాలంటూ ఆ యువతి వేడుకున్నా కనికరించలేదు. దీంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. నెల రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో మృతురాలు కుటుంబీకులు, బంధువులు మృతదేహాన్ని ఆ యువకుడి ఇంటి వద్ద ఉంచి ఆందోళనకు దిగారు. మండలపరిధిలోని ధర్మరాజ్‌పల్లి గ్రామానికి చెందిన యశ్వంత్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన బాషబోయిన తేజశ్రీ (18)లు మూడు సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. గతేడాది అక్టోబర్‌ 15న పెళ్లి చేసుకున్నారు. అక్టోబర్‌ 19న పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు కాపురం చేసుకుంటామని ఒప్పుకున్నారు. అయితే ఇద్దరి కులాలు వేరుకావడంతో విభేదాలు వచ్చాయి. యువతికి అండగా కులపెద్దలు ఉండి పెద్ద ఎత్తున నిరసనలు తెలిపినా ఎలాంటి న్యాయం జరగలేదు. దీంతో ఆ యువతి పురుగుల మందు తాగింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. నెల రోజులుగా చికిత్స పొందుతున్న తేజశ్రీ మంగళవారం వేకువజామున మృతి చెందింది. తేజశ్రీ మృతదేహాన్ని యశ్వంత్‌రెడ్డి ఇంటి వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ శ్రీధర్‌, ఎస్‌ఐ సందీప్‌రెడ్డిలు సంఘటన స్థలానికి వచ్చి ఆందోళనకారులకు నచ్చజె ప్పారు. పోలీసులు చివరికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి అంత్యక్రియలు చేశారు.



తేజశ్రీ(ఫైల్‌)

ఔటర్‌పై అత్యవసర వైద్యసేవలు

గతేడాది వెయ్యి మందికిపైగా చికిత్స

- ఔటర్‌రింగ్‌రోడ్డుపై ప్రమాద బాధితులకు క్షణాల్లో వైద్యసదుపాయం
- ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్‌ సెంటర్లు
- టెలీమెడిసిన్‌ ద్వారా వైద్య నిపుణుల పర్యవేక్షణ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌ చుట్టూ 158 కిలోమీటర్ల మేర ఉన్న ఔటర్‌ రింగురోడ్డుపై ప్రమాదాల నియంత్రణకు హెచ్‌ఎండీఏ అనేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్‌ గ్రోత్‌ కారిడార్‌ లిమిటెడ్‌ (హెచ్‌జీసీఎల్‌) ఆధ్వర్యంలో ఔటర్‌పైన ప్రతి 8 కిలోమీటర్లకు ఒక అడ్వాన్స్‌డ్‌ లైఫ్‌ సపోర్ట్‌ అంబులెన్సు(ఏఎల్‌ఎస్‌) అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. 16 ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద అత్యవసర వైద్యసేవలకు ట్రామాకేర్‌ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లలో గతేడాది 1098 మంది రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్యసేవలు అందించారు. అపోలో, యశోద ఆస్పత్రులు ఈ అంబులెన్సులుచ ట్రామాకేర్‌ సెంటర్ల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నాయి. గతేడాది అందజేసిన సేవలకు సంబంధించిన వివరాలను అధికారులు తాజాగా విడుదల చేశారు. పెద్దఅంబర్‌పేట్‌, బొంగులూరు, తుక్కుగూడ, శంషాబాద్‌, టీఎస్‌పీఏ ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద అపోలో ఏఎల్‌ఎస్‌ అంబులెన్సులు ఉండగా, తారామతిపేట్‌, రావిర్యాల, పెద్దగోల్కొండ ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ట్రామాకేర్‌ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. కోకాపేట్‌, పటాన్‌చెరు, దుండిగల్‌, శామీర్‌పేట్‌, ఘట్‌కేసర్‌లలో యశోద ఆసుపత్రికి చెందిన ఏఎల్‌ఎస్‌ అంబులెన్సులు 24 గంటల పాటు సేవలందజేస్తున్నాయి. కొల్లూరు, సుల్తాన్‌పూర్‌, మేడ్చల్‌లో ట్రామాకేర్‌ సెంటర్లను నిర్వహిస్తున్నారు. ప్రతి ట్రామాకేర్‌ సెంటర్‌లో 2 పడకలు, అవసరమైన వైద్య పరికరాలు, ఆక్సిజన్‌ సిలిండర్‌, అత్యవసర ప్రాణాధార మందులు ఉంటాయి. మరోవైపు టెలీమెడిసిన్‌ సదుపాయం ద్వారా వైద్యనిపుణులు సలహాలు, సూచనలు, వైద్యసేవలు అందిస్తున్నారు. పారామెడికల్‌ సిబ్బందితో కూడిన అంబులెన్సులను అన్ని కీలకమైన కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని ట్రామాకేర్‌ సెంటర్‌లకు తరలించే విధంగా ఈ అంబులెన్సులు సేవలను అందిస్తాయి. ఈ వైద్యసేవలన్నీ పూర్తిగా ఉచితం.



పటాన్‌చెరు	79	టీఎస్‌పీఏ	157
దుండిగల్‌	143	కోకాపేట్‌	91
శామీర్‌పేట్‌	85	తారామతిపేట్‌	25
ఘట్‌కేసర్‌	77	రావిర్యాల	3
పెద్దఅంబర్‌పేట్‌	127	పెద్దగోల్కొండ	9
బొంగులూరు	55	కొల్లూరు	48
తుక్కుగూడ	57	సుల్తాన్‌పూర్‌	39
శంషాబాద్‌	91	మేడ్చల్‌	12

(జనవరి నుంచి డిసెంబర్‌(2022) వరకు ఔటర్‌ రింగ్‌ రోడ్డు పరిధిలోని ఆయా ఇంటర్‌చేంజ్‌ల వద్ద ట్రామాకేర్‌ సెంటర్లలో అందిన సత్వర వైద్య సేవలు ఇవి.)